# మొగుడు

**నా**రాయణ చేతిలోని ముంతనెత్తి ఆఖరి బొట్టు ఇప్పసారాని నోట్లోకొంపుకున్నాడు. ముంతలో సారా అయిపోయింది దాంతోపాటు జేబులో డబ్బులు కూడా అయిపోయినాయ్. అతను పుల్లగా త్రేన్చేడు. కడుపులోకెళ్ళిన సారా అక్కడ ఉండకుండా నరాల్లోకెక్కి నిషాని శరీరమంతా బట్వాడా చేస్తోంది.

అతనికెంతో హాయిగా వుందనిపించింది. ఒక్కసారి కాళ్ళు చేతులు విదిలించి జేబులోంచి బీడీ తీసి వెలిగించేడు.

అతడి పూర్తిపేరు లక్ష్మీనారాయణ, కాని కూలీపన్చేసుకునే ఆ ఏబ్రాసి వెధవగాడిని అలా పిలవటానికిచ్చగించిన ప్రజలు కేవలం నారాయణని మాత్రమే పిలవటంతో అదే సార్ధక నామమైపోయింది. అతడు ప్రక్కన్న వున్న ఫ్యాక్టరీలో ముఠా పనిలాంటిది చేస్తాడు. ఎర్రగా కాల్చిన ఇనుప కడ్డీలని, జీవితం లాంటి బరువైన సుత్తితో కొట్టటం అతడి పని. ఆ పనికొన్ని సంవత్సరాలుగా చెయ్యటం వల్ల వాడి చేతులు కాయలుకాచి, కండలు ఇనుపగుళ్ళలాగా తయారైనాయ్ అటువంటి కండలు తిరిగిన శరీరంతో మైదానం లాంటి ఛాతి, దానిపై అడవిలా విస్తరించిన గుబురు వెంట్రుకలతో మూతిమీద నిలబడి ఆకాశాన్ని చూస్తున్నట్లున్న కోరమీసంతోను– చూడటానికి మిలటరీ వ్యక్తిలా ఉంటాడు.

అతడి భార్య పేరు సత్తెమ్మ – రోగిష్టి మనిషి పది నిముషాలు తిరిగి ఆయాసంతో గంటసేపు పడుకుంటుంది. జబ్బేమిటో తెలీదు. తెలీటానికి ఆమెనెప్పుడూ డాక్టరు వద్దకి తీసుకెళ్ళలేదు. ఇద్దరు పిల్లల్ని కన్నాక మరీపాతడొక్కు మిషనులా తయారైంది.

నారాయణ చేతిలోని బీడి ఆరిపోయింది. చల్లగాలి ఒంటికి తాకి హాయిగా అనిపిస్తోంది. అతడికి ఇంటికెళ్ళాలనిపించటం లేదు. సత్తెమ్మ ముక్కుతూ, మూల్గుతూ పడుకుని దర్శనమిస్తుంది. అతడే కూడెట్టుకుతినాలి. అది నారాయణకి సుతారము గిట్టదు. అసలయినా వాడికప్పుడు కావలసింది కూడుకాదు...

చవితివెన్నెల గుడ్డి దీపంలా వెలా తెలాపోతోంది. సినిమాకెళ్ళొస్తున్న వాళ్ళు ఇపుడు చూసిన సినిమాలో సన్నివేశాలు అంతకు మునుపు ఏ ఏ సినిమాల్లో చూసేరొ పెద్దగా చర్చించుకుంటూ వెళుతున్నారు. సారాత్రాగుతున్న జనం పెద్దగా మాట్లాడుకోవడంతో గొడవగా, గందరగోళంగా వుంది.

నారాయణ లేచి బయటకొచ్చి ప్రక్కన ఉన్న సిమెంటు చప్టామీద కూర్చున్నాడు. అతడి కేదో వెల్తిగా, లోటుగా వుంది. పూజ పూర్తిచేసి నైవేద్యం మర్చిపోయినట్లుగా వుంది. అతడికేదో కావాలి. జేబులో డబ్బులుంటే ఇంకో ముంత త్రాగవలసిన పరిస్థితి ఒళ్ళంతా బిరుసెక్కి, పగలంతా పన్చెయ్యటం వల్ల చేతులు కొద్దినెప్పిగా అన్పిస్తున్నాయ్. త్రాగిన మందు తాలూకునిషా శరీరమంతా పరచుకుంది. కళ్ళు కాస్తవాలుతున్నట్లుగా అన్పిస్తున్నాయ్. అటువంటి పరిస్థితిలో వాడికి తలుపులమ్మ గుర్తొచ్చింది.

తలుపులమ్మ!

'అద్గది– ఇపుడు తెల్సింది తనకేంకావాలో'' అనుకున్నాడు నారాయణ హుషారుగా ఆరిపోయిన బీడిని ముట్టిస్తు. ఆమె ఆలోచన్లతోనే వాడి ఒళ్ళు ఆనందంతో పులకరించింది.ప్రాణం రెపరెప లాడింది.

తలుపులమ్మ చెయ్యెత్తు మనిషి. గుండ్రని మొహం, పావలాకాసంత బొట్టు, పైకి పొడుచుకొచ్చిన ఎదురు రొమ్ములు, చెక్కసున్నం చేసి నట్లుండే వీపు, చూపరులని రెచ్చగొట్టటానికన్నట్లు ఒకే ఒకముడతపడే నడుము. కొద్దికొద్దిగా విస్తరించిన పిరుదులు...ఓహ్....

నారాయణ చేతి గుడ్డతో మొహం తుడుచుకున్నాడు.

దాన్ని చూసినపుడల్లా వాడి ప్రాణం రెపరెప లాడేది. వాడికి దేవుడంటె నమ్మకం లేక పోయినా, తలుపులమ్మని చూసిన ప్రతిసారి నమ్మకం లేని ఆ దేవుడిమీద విపరీతమైన కోపం వచ్చేది. కాకపోతే ఏవిటి వాడి చిలిపిపన్లు; వుక్కులాంటితనకి రోగిష్టి భార్య– మాంచిబందో బస్తుగా, రంజుగా, రంభలావున్న తలుపులమ్మకి అసలా ధ్యాసేలేని రాజయ్యగాడు– అందుకే దేవుడంటే నారాయణకి కోపం.

రాజయ్య– తలుపులమ్మ మొగుడుపగలంతా రిక్షాలాగేవాడు. సాయంత్రం అయ్యే సరికల్లా సారాదుకాణానికొచ్చేవాడు.

నారాయణ, వాడు కల్సి త్రాగేవారు. రాజయ్య, విపరీతంగా తాగేవాడు– కళ్లు పెట్టి పోయేటట్టు, నరాలు దారాల్లాగా తెగిపోయేటట్లు– త్రాగిన నారాయణకే భయం వేసేటట్లుగా త్రాగేవాడు పగలంతా సంపాదించినదంతా త్రాగేస్తేనేగాని ఇళ్ళేవాడుకాదు.

ఈమధ్యనే వాడు పోయాడు. తలుపులమ్మని ఒంటరిదాన్ని చేసి, నీ చావు నువు చావమన్నట్లుగా, వాడు మాత్రం తప్పుకున్నాడు.

అప్పటినించి తలుపులమ్మతో పాటుగా నారాయణని గూడా ఒంటరితనం ఆవహించింది. ఒక్కడే కూచుని త్రాగాలంటే కడుబాధగా అనిపిస్తోంది. ఇదిచాలదన్నట్లు ఈమధ్యన తలుపులమ్మ గురించి ఆలోచన్లు, పలవరింతలు, బ్రతికుండగా ఆమెనను భవించలేకపోయిన రాజయ్య చచ్చి తన బుర్రలోజొరబడి, ఆలోచన్లని ఆమె వైపు త్రిప్పుతున్నాడా అన్నట్లువాంఛ, ఆలోచన్లకి ఆనకట్ట వెయ్యటం శక్తికి మించినపనిలా అన్పించింది.

భర్త పోయాక, తలుపులమ్మ బ్రతకటం కోసం సినిమాహాల్లో శుభ్రం చేసే పనికి ఒప్పుకుంది. ఆమె ఒకత్తె– పిల్లాజెల్లా జంఝాంటం లేదు. అక్కడికీ నారాయణ రెండుసార్లు సినిమా నెపంతో హాలుకెళ్ళి ఆమెని చూడాలని, మాట్లాడాలని ప్రయత్నం చేసేడు. కాని ఒకసారి అసలామె కన్పించనేలేదు. మరోసారి విపరీతమైన రద్దీవల్ల ఆమెని సరిగ్గా చూడటానికే వీలు కాలేదు. ఆ విధంగా ప్రయత్నించినా ప్రతిసారీ ఏదో ఒక అవరోధం ఏర్పడటం వల్ల ఆమెని కనులారా చూడటానికిగాని, మనస్సులోని వెచ్చటి మాట చెప్పటానికి గాని వీలు చిక్కలేదు. రోజులు గడుస్తున్న కొద్దీ అతడిలోని కోర్కె వుదయిస్తున్న సూర్యుడిలా బలపడి తాపం తీవ్రరూపం దాలుస్తున్నదే గాని, అస్తమించి, శాంతించే అవకాశాలు కన్పించటం లేదు.

అందువల్లనే ఆ విధంగా సిమెంటుబల్లపైన కూర్చున్న నారాయణ ఒక తీర్మానాన్ని తనకు తానే ప్రతిపాదించుకుని, ఏకగ్రీవంగా ఆమోదించుకున్నాడు. ఆతీర్మాన సారాంశం: తాను తలుపులమ్మ విషయంలో ఇంకేమాత్రం ఆలస్యం చెయ్యకూడదు– అని. తనిలా సారాత్రాగి చుక్కలు లెక్కబెడుతూ కూర్చుంటే అది ఎవడితోనైనా షడీకయ్యే ప్రమాదం వుందని, ఒక వేళ దానికావుద్దేశ్యం లేకపోయినా, తనలాంటి మరో రసిక ప్రియుడు దానికి లయకొట్టి లైన్లో పెట్టే అవకాశం వుందని గూడా గ్రహించాడు అసలు ఇన్నాళ్ళు జాగుచేసినందుకు తానే కూకలేసుకున్నాడు.

వెంటనే ఆమోదించిన తీర్మానాన్ని అమలు చెయ్యటానికన్నట్లు అతడు లేచి నించున్నాడు చేతిగుడ్డతో మొహాన్ని మరొక్కసారి తుడిచి కదిలాడు, తలుపులమ్మ గుడిసెవైపుగా.

జీవంలేని వెన్నెల రోడ్డు మీదపడి బొల్లిమచ్చల్లా అసహ్యంగా వుంది. వుండి వుండి వస్తున్న గాలి సైడు కాలవలోని కుళ్ళు కంపుని పరిసరాలకి పంచుతోంది. దూరాన రెండు కుక్కలు పోటీపడి అరుస్తున్నాయ్.

నడుస్తున్న నారాయణకి చటుక్కున ఒక విషయం గుర్తుకొచ్చింది. అతడు నిన్నటి వుదయం పన్లోకెడుతున్నప్పుడు వెనకనించి అతడి భార్య సత్తెమ్మ ఒకమాట చెప్పింది.

"ఆ తలుపులమ్మ వచ్చి మన జాలయ్య గాడిని తీసుకెళ్ళింది" అని.

"ఎందుకంట?" అనడిగాడు యధాలాపంగా మొగుడి దినంట" అంది సత్తెమ్మ. మళ్ళీ నారాయణ కదిలి బయటకి కాలెడుతూ "దాని మొగుడి దినానికి జాలయ్యగాడెందుకు. పంతుల్ని పిలవాలిగాని" అనేసి వెళ్ళిపోయాడు.

ఆ రాత్రి నారాయణ సారా తాగి ఇంటికి చేరే సరికి, వాడి కొడుకు జాలయ్య– ఆరేళ్ళ వెధవ, సంతోషంగా ప్రపంచాన్నే జయించినంత సంబరంతో ఎదురొచ్చేడు. సాధారణంగా అతడు ఇంటికి చేరేసరికి పిల్లా పెద్దా అంతా నిద్రావస్థలో వుంటారు.

కాని ఆరోజు, దానికి భిన్నంగా, జాలయ్య గాడు తండ్రికోసం ఎదురుచూస్తూ కూర్చుని, అతడు కన్పించగానే ఆప్యాయంగా, చొరవగా ఎదురొచ్చి 'అయ్యా– చూసేవా– కొత్తలాగూ చొక్కా– ఎలాగున్నాయ్' అనడిగాడు.

నారాయణవాడినలాగే ఎత్తుకుని, సారాకంపు నోటితో ముద్దెట్టుకుని "ఎక్కడివిరా డబ్బు లెక్కడినిచ్చి వచ్చాయ్?' అనడిగాడు. దానికి ఆరేళ్ళ జాలయ్యకి ఏం చెప్పాలో తెలీక, తల్లివంక చూసేడు.

సత్తెమ్మ అతడి ప్రశ్నకి సమాధానం చెప్పింది.

"పొద్దున్న తలుపులమ్మ ఆడినితీసికెళ్ళిందని చెప్పానుగా. ఆడికి తలకి నీళ్లోసి, బువ్వెట్టి, బజారెత్తుకెళ్ళి ఆ లాగు చొక్కా కొనిచ్చింది' అని.

నారాయణకీవిషయం బొత్తిగా అర్థం కాలేదు. జాలయ్యగారి మీద దానికెందుకంత ప్రేమ– వాడికి లాగుని చొక్కా కొనివ్వాల్సిన అవసరం దానికేవిటి?

అంతలో సత్తెమ్మ మరోమాట గూడా చెప్పింది "ఇయ్యాల రాజయ్య గాడిదినంట."

ఆమాటవిన్న నారాయణ పెద్దగానవ్వాడు– "రాజయ్యగాడి దినానికి వీడి కొత్తబట్టకి ఏవిటి సంబంధం?" అన్నాడు.

దానికి సత్తెమ్మ ఏం మాట్లాడక వూరుకుండిపోయింది.

ఆ రాత్రి సంభాషణ అక్కడితో ఆగింది.

నడుస్తున్న నారాయణ గూడా ఆగేడు.

అవును ఇపుడా విషయం తనకెందుకు గుర్తుకొచ్చినట్లు? తన మనస్సులో సుళ్ళు తిరుగుతున్న విషయానికి దీనికి ఏవిటి సంబంధం? అసలుందా– వుంటే ఏవిటి?

ఆగి ఒక్కక్షణం సారా ఎక్కిన బుర్రతో నిషాలోచన చేసేడు.

వాడికి మబ్బులు క్రమక్రమంగా విడిపోతున్నట్లు, తన సమస్యకి పరిష్కారం, కాలుస్తున్న కోర్కెని తీర్చుకునే అవకాశం అతిచేరువుగా వున్నట్లు తోచింది.

తలుపులమ్మ పిల్లగాడిని దగ్గరకు తీసి ముద్దాడిందంటే దానర్థం– దానికి పిల్లలంటే ఇష్టమని చెప్పటం.

ఆ వూళ్ళో, ఆ పేటలో ఎంతోమంది పిల్ల వెధవలుండగా అది తన పిల్లాడిని,

తన జాలయ్య గాడినే ముద్దాడిందంటే– దానికి తనంటె ఇష్టమని చెప్పటం.

అందుకోసమే అది జాలయ్యగాడిని తీసుకెళ్ళి తలకు నీళ్ళుపోసి, అన్నం పెట్టి, ఇంకా చాలదన్నట్లుగా వాడికి కొత్తబట్టలు గూడా కొని పెట్టింది. అంటె అది 'రేయ్– నారాయణా– పిచ్చిసన్నాసి ఇంకా అర్థంకాలేదా'ని అడుగుతోందన్నమాట. ఆడుమనిషి అంతకన్నా ఎక్కువ ఎలా చెప్పగలదు అనుకుని తలుపులమ్మ పైనిజాలి, తనపైన అసహ్యం ప్రదర్శించుకున్నాడు నారాయణ. ఛఛ– ఎంతటి వెధవ నాయాలగాడు తను. సారా త్రాగే ఎదవలకి బుర్ర పన్చెయ్యదంటారు ఇదేగామోసు! కాకపోతే ఇంతటి చిన్న విషయాన్ని గ్రహించటానికి ఎన్నాళ్ళుపట్టింది? అజ్ఞానంలో పడి ఎంతటి విలువైన కాలాన్ని అనవసరంగా వృధా చేసేడుతను?

నారాయణకి ఆ విధమైన జ్ఞానోదయం కల్గటంతో ఒళ్ళు పులకరించింది. త్రాగిన సారా సార్థకం అయినట్లు భావించేడు.

వెంటనే మళ్ళీ కదలి చకచకా నడవటం మొదలు పెట్టేడు.

ఇప్పుడతని అడుగుల్లో సందేహంగాని, సంధిగ్ధంగాని లేవు. తలుపులమ్మే ఎదురుగా వచ్చి నారాయణా– ఇంకేమిటీఆలస్యం– త్వరగా అని చిరుకోపం ప్రదర్శిస్తున్నట్లు ఆత్రంగా నడుస్తున్నాడు. ఇహ వెళ్ళి ఆమెని తన చేతుల్లోకి తీసుకుని, తన వుక్కుకౌగిలిలో ఆమెని బంధించి పరవశించిపోవటమే తరువాయి అన్నట్లుగా నడుస్తున్నాడు.

పైనించి విమానం పెద్దగా శబ్దం చేసుకుంటూ వెళ్ళింది. ఎవరింట్లోనో పసిగుడ్డు గుక్కలు పట్టి ఏడుస్తోంది. ఒక ఆడమనిషి పిల్లవాడిని అన్నానికి రమ్మనమని పిలుస్తోంది. ఆ బజారు గజ్జికుక్క బాధవల్లకాబోలు మూలుగుతోంది.

నారాయణ త్వరగా నడిచి తలుపులమ్మ గుడిసెని సమీపించేడు.

జేబులోంచి బీడీతీసి వెలిగించాడు.

గుడిసెలోంచి దీపపుకాంతి సన్నగా కన్పిస్తోంది. మబ్బులు తొలగిపోవటం వల్ల వెన్నెలకి వున్నంతలో స్పష్టత లభించింది.

నారాయణ బీడీ దమ్ము గట్టిగా లాగి, ఆమెని పిలవబోయి, ఎందువల్లనో ఆగేడు చివరికి ఏదో నిర్ణయించుకున్న వాడిలా మెల్లిగా దగ్గేడు.

ఆ శబ్దం విన్న తలుపులమ్మ బయటకొచ్చింది. దూరంగా చీకట్లో నిల్చున్న ఆకారాన్ని వెంటనే గుర్తించలేక "ఎవరది?"

అంది భయంభయంగా.

అప్పటికీ నారాయణ బదులివ్వక చీకట్లో నించి ఆమెని నమిలిమింగేసేలా చూస్తున్నాడు కయిపెక్కిన కళ్ళతో.

తలుపులమ్మ కొద్దిగా ముందుకొచ్చింది.

ఆమె నీలం రంగు చీరకట్టుకుని, కుచ్చెళ్ళు పైకిలాగి దోపుకోవటంచేత ఆమె పిక్కలు అరటి బోదుల్లాగా వున్నాయ్, జుట్టుని ముడివేసి, దాని పైనించి పైటని బిగించి కప్పుకోవటం వల్ల పొంగిన ఛాతి పొంకంగా ఆశలు కల్పించేలా ఉంది.

నారాయణ ప్రాణం తహతహలాడింది.

అంతలో ఆమె మళ్ళీ "ఎవరది– ఎవరంటుంటే" అంది అనుమానంగా అప్పుడు "నేనే నారాయణని" అన్నాడు మెల్లగా.

ఆ మాటవిన్న ఆమె గుండె కుదుటపడింది. "ఏమిటి సంగతి ఇలా వచ్చావ్?" అని అడిగింది.

నారాయణకి ఏం చెప్పాలో, ఎలా మొదలు పెట్టాలో తేల్చుకోలేక "కాసేపు నీతో వూసులాడి పోదామని వచ్చేను" అన్నాడు.

నారాయణ ఎందుకొచ్చాడో ఆమెకి తెల్సును "పిరికివెధవ" అనుకుంది– పిరికి వాళ్ళంటే చాలా మంది ఆడవాళ్ళకిమల్లె ఆమెక్కూడా అసహ్యం అందువల్లనే కోపంగా "నాతో నీకు వూసులేంటి? ఎవరైనా చూస్తే నవ్వెయ్యగలరు– వెళ్ళు" అంది.

కాని నారాయణకి వెళ్ళటం అందులో విషయం తేల్చుకోకుండా వెళ్ళటం ఎంతమాత్రం ఇష్టం లేదు. కాస్సేపు నరాల్లో ఓపిక, గుండెలో ధైర్యం వచ్చేదాకా వుండగల్గితే మనసులోని మాటని చెప్పెయ్యగలడు, కాని కాస్సేపు అక్కడుండాలంటే ఆమెని కబుర్లలోకి దింపాలి.

అందుకని "మా జాలయ్య గాడికి కొత్తబట్టలిప్పించావంట, ఏమిటి గిరాకీ?" సంజాయిషీ అడుగుతున్న వాడిలా అన్నాడు.

అందుకు తలుపులమ్మ "నిన్న రాజయ్య గాడి దినం అందుకని" అన్నది చాలా తేలిగ్గా.

ఆ మాటవిన్న నారాయణ చీకట్లోంచి వెచ్చగా వికృతంగా నవ్వేడు.

"రాజయ్యగాడి దినానికి, జాలయ్యగాడికి ఏవిటే సంబంధం" అన్నాడు.

ఆ మాటవిన్న తలుపులమ్మ మొహంలో స్పష్టమైన మార్పు కన్పించింది. గతం తాలూకు నల్లటి నీడలు గోచరించాయ్. ఆమె చీకట్లో నిల్చున్న అతడినుద్దేశించి" అలాకూర్చో" మంది నారాయణ పరమానందభరితుడై ప్రక్కనే వున్న రాయైన పరివేష్టించేడు. ఆమె గూడా గుడిసెముందు చతికిలపడింది. లోపల్నించి వస్తున్న గుడ్డివెలుగు ఆమె వీపుభాగాన పడి అందంగా ప్రకాశిస్తోంది.

ఆమె కూర్చున్నాక మళ్ళీ అంది. "ఏంటన్నావ్?"

"రాజయ్యగాడి దినానికి, జాలయ్యకి ఏమిటి సంబంధం" అని అన్నానన్నాడు.

ఆమె తాపీగా, బ్రతుకు కథ చెపుతున్న దానిలా, గతాన్ని త్రవ్వుకుంటూ నల్లటి జ్ఞాపకపు పూలని ఏరుకుంటున్న దానిలా చెప్పసాగింది.

"రాజయ్యగాడు త్రాగేవాడు. నీకు తెల్సుగదా? పగలంతా వొళ్ళు విరుచుకుని రిక్షాలాగే వాడు.కాని ఆది సంపాదన ఏనాడు ఇంటిదాకా రాలేదు. ఎంత సంపాయిస్తే అంత త్రాగేసేవాడు– కదూ?"

నారాయణ అవునన్నట్లు తలాడించేడు.

"వాడితో నాకు మనువయ్యి అయిదేళ్ళయింది ఈ అయిదేళ్ళ కాలంలో ఒక్కశారన్నా కనీంసం ఒక్కరూపాయి తెచ్చి నాచేతిలో పెట్టలేదు అలాగని చెప్పి వాడిని పస్తులుంచాననుకున్నావా? లేదు నేనూ కష్టపడ్డాను. చాకిరీ చేసేను కొన్నాళ్ళు అట్లుపోసి సినిమా హాలుకాడ అమ్మేను. కొన్నాళ్ళు పాచిపన్లుచేసేను. మరికొన్నాళ్ళు మున్సిపాలిటీ వాళ్ళ రోడ్డు వూడ్చేను. ఏదో ఒకటిచేసి ఆడొచ్చేసరికి కూడు సిద్ధంగా వుంచేదాన్ని చాకిరీ చెయ్యాల్సి వచ్చినందుకు కాదు నా బాధ వాడు కనీసం ఏవిటి చేస్తున్నావ్– ఎక్కడి నించి పట్టుకొస్తున్నావ్ అనిగూడా అడిగేవాడుకాదు" ఆమె ఆగి చీకట్లో ఉన్న నారాయణవైపుగా చూసింది.

నారాయణ ఆమె వంపుసొంపుల్ని చూస్తూ నాగస్వరం వింటున్న నాగులాతలాడిస్తున్నాడు

ఆమె మళ్ళీ చెప్పసాగింది.

“ఒకసారి నాకు నాల్గు నెలల కడుపొయింది. అపుడు పదిరోజులు ఆస్పత్రిలో వున్నాను ఆ పదిరోజులలొ నరకం చూశాను పేగుల్ని మెలితిప్పేబాధ– పట్టించుకోని డాక్టర్లు, చేతిలో డబ్బుల్లేవు పదిరోజుల్లో వాడు కనీసం ఒక్కసారన్నా వచ్చి ‘ఏంటే తలుపులూ, ఎలా వుంది ఏవిటి విషయ’మని అడిగిన పాపాపపోలేదు. ఆడి ధ్యాస ఆడిది– త్రాగుడు, త్రాగుడు.”

నారాయణ చీకట్లో అసహనంగా కదిలేడు ఇపుడెందుకో ఆమె వైపు నుంచి వస్తున్న గాలి వెచ్చగా వున్నట్లనిపించింది.

ఆమె తన గుండెల్లోకి చేదవేసి భావాలని తోడుతున్నట్లుగా చెప్పసాగింది.

“నాకెప్పుడూ వాడంటే కోపంలేదు. కాని నా కర్థంకానిదల్లా యిలాంటి వాళ్ళు ఎందుకు మనువాడతారని. ఒంటరిగా ఉండి తాగెయ్యొచ్చుగా? తాగితాగి చచ్చిపోవచ్చుగా? కాని ప్రతి వెధవకి పెళ్ళాం కావాలి కూడొండి పెట్టడానికి.”

నారాయణ అసహనంగాకదిలాడు ఆ మాటలు తనని ఉద్దేశించి గూడా అంటున్నదేమో నన్న అనుమానం రావటంతో అతడికికాస్త అసౌకర్యంగా అనిపించింది.

“వాడే నీలాగేతాగి పదింటికి వూక్కుంటూ వచ్చేవాడు. మాటా, పలుకు, ముద్దు ముచ్చట ఏవీలేవు. పైగా నేను వాడిని దగ్గిరికి తీసికూడు కలిపి, ముద్దలు చేసి పెట్టేదాన్ని. కాస్తతినేవాడు. తర్వాత చిన్న పిల్లవాడిలా నా రొమ్ముల మధ్యన తలుంచుకుని ఒళ్ళు తెలీకుండా పడుండేవాడు. మళ్ళీ తెల్లారి రోడ్లు, రిక్షా– ఇపుడు చెప్పువాడికి మీ జాలయ్యగాడికి ఏమిటితేడా?” అంది.

నారాయణకి ఎందువల్లనో ఆమె అంటున్న ప్రతి మాట సూటిగా ములుకుల్లాగా గుచ్చుకుంటున్నట్లుగా అనిపించింది. ఆమె రాజయ్య గురించి

మాట్లాడుతున్నప్పటికి, ఆమె మాటల్లో తన ప్రస్తావన గూడా వున్నట్లుగా తోచింది. అతడిలో వచ్చినప్పటి వుత్సాహం చప్పున చల్లారి పోయింది. కాని కదల్లేక అలాగే కూర్చుండిపోయేడు.

“పోయాడు – వాడు పోతాడని తెల్సు అలా తాగినవాడెవడూ బతకడు నా మంచీచెడ్డా, కష్టం సుఖం చూడనివాడు పోతేనాకేమిటి? ఇంకో విషయం చెప్పనా– వాడు పోయినరోజు, వాడి శవాన్ని చూస్తున్నప్పుడు, అదేవిటో మొగుడుపోయాడన్న విచారంగాని, ఏడుపుగాని రాలేదు. పైగా అయిదు పదేళ్ళ కుర్ర వెధవ– నా గుండెలపై పడుకున్ని ద్రోయే పిల్లవాడు పొయినట్లుగా అన్పించింది– అంతే!”

ఆమాట విన్న నారాయణకి సారాతాలూకు నిషా పూర్తిగా జారిపోయింది. తానడిగిన ప్రశ్నకు జవాబుగూడా లభించినట్లనిపించింది.

అంతలోనే ఆమె “అందువల్లనే– అడిదినానికి పంతుల్ని పిలవటంకన్నా పిల్లవాడికి బట్టలు పెట్టటం సరైన పనిగా తోచిఁది.” అంది. ఆ మాట అంటున్నపుడు ఆమె సంజాయిషీనిస్తున్న దోషిలాకాకుండా. తీర్పుచెబుతున్న న్యాయమూర్తిలా వుంది.

నారాయణ ఇంకేమాత్రం వినలేనట్లు లేచాడు. తాను అడగాలని, చెప్పాలనుకున్న విషయం పూర్తిగా మరిచిపోయేడు.

అతగాడితో పాటుగా ఆమె గూడా లేచి, నిలబడింది.

పిరుదులకంటుకున్న మట్టిన రెండు చేతులతో దులుపుకుంటూ “పచ్చతాడు కట్టిన ప్రతియెదవ మొగుడుకాదు. ఆమె పదిలంగా చూసుకున్న వాడే మొగుడు. ఇంతకి సత్తెమ్మకెలాగుంది? డాక్టరుకి చూపించావా?” అనడిగింది.

నారాయణకి ఏం చెప్పాలో తెలీక అస్పష్టంగా గొణిగాడు. ఇక ఇక్కడుండటం ఎంత మాత్రం శ్రేయస్కరం కాదని, కదిలి వెళ్ళబోతూ ఎందుకో వెనక్కి తిరిగి తలుపులమ్మ వైపుగా చూసేడు.

ఆమె నడుం పైని చేతులుంచుకుని నారాయణ వైపు ఆశ్చర్యంగా చూస్తోంది. చవితి వెన్నెల మసక వెలుగు, గుడ్డిదీపపు అస్పష్టపు కాంతి కల్సిన ఆ చిరువెలుగులో ఆమె నుదుట నున్న పావలాకాసంత ఎర్రబొట్టు సూర్యబింబంలా మెరిసింది.

అది చూసిన నారాయణ బెదిరి వడివడిగా కదిలి చీకట్లో కల్సిపోయాడు.